

సమావేశంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పక్కన విప్ ప్రభాకర్

# నిజామాబాద్‌లోనైనా నిజాలు చెప్పండి

- గల్లీ లెక్కలు కాదు.. ఢిల్లీ లెక్కలు తెచ్చుకోండి
- రైతు బంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్‌లో ప్రధాని మోదీ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని, కనీసం.. నిజామాబాద్‌లోనైనా నిజాలు మాట్లాడాలని రైతు బంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి హితవు చెప్పారు. రాష్ట్ర బీజేపీ నేతలు ఇచ్చే గల్లీలెక్కలు పక్కనపెట్టి.. కేంద్రం నుంచి అధికారిక లెక్కలు తెచ్చుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్‌ఎల్పీలో సోమవారం ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్‌తో కలిసి పల్లా రాజేశ్వర్‌రెడ్డి మీడియాతో మట్లాడారు. దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కలిసి గాడ్సే భావజాలాన్ని విస్తరిస్తున్నాయని మండిపడ్డారు. నకిలీ గాంధీ (కాంగ్రెస్)లు ఆయన పేరును దిగజారుస్తున్నారని విమర్శించారు. దేశంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం గాంధేయవాదాన్ని భుజానికెత్తుకున్నదని, గాంధేయవాదంతోనే తెలంగాణ ఉద్యమాన్ని నడిపించి, విజయతీరాలకు చేర్చారని గుర్తుచేశారు.

**చుక్కనీరు లేకుండా వరిసాగు ఎలా సాధ్యం?**

ప్రధాని మోదీ అవాస్తవాలు మాట్లాడటం సరికాదని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'ధాన్యం సేకరణ కోసం 2014లో రూ. 3,400 కోట్లు ఇస్తే.. ఇప్పుడు రూ.27 వేల కోట్లు ఇస్తున్నాం' అని మోదీనే స్వయంగా చెప్పారని.. చుక్కనీళ్లు లేకపోతే అంత ధాన్యం ఉత్పత్తి ఎలా పెరిగిందని నిలదీశారు.

**మీ జేబుసంస్థలు ఊరుకుంటాయా?**

నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఇవ్వాలని 2014 నుంచే బీఆర్‌ఎస్ కోరుతున్నదని పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. చివరికి.. ఎన్నికలకు ముందు మోదీకి పసుపు రైతులపై ప్రేమ పుట్టుకొచ్చిందని, అయినా సంతోషమేనని అన్నారు. బీఆర్‌ఎస్‌ది కుటుంబ పార్టీ అని మోదీ అనడం హాస్యాస్పదంగా ఉన్నదని విమర్శించారు.

**గిరిజన యూనివర్సిటీపై మోదీవన్నీ అబద్ధాలే**

విభజన చట్టం ప్రకారం తెలంగాణకు గిరిజన యూనివర్సిటీ ఇవ్వాలని స్పష్టంగా ఉన్నదని పల్లా రాజేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. భూమి ఇవ్వలేదు కాబట్టే గిరిజన యూనివర్సిటీ ఆలస్యమైందని మోదీ పచ్చి అబద్ధం చెప్పారని, 2016లోనే భూమిని కేటాయించి, కేంద్రానికి లేఖలు పంపామని తెలిపారు.

ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం నిజామాబాద్‌కు వస్తున్నారు. ఆయన హెలికాప్టర్ నిజామాబాద్ కలెక్టరేట్ ఆవరణలోని హెలిప్యాడ్‌పై ల్యాండ్ కానున్నది. దాన్ని కట్టించింది కేసీఆర్ ప్రభుత్వం. దిగి తలెత్తి చూడగానే సువిశాల ప్రాంగణంలో కలెక్టరేట్ సముదాయం కనిపిస్తుంది. దాన్ని కట్టించింది కేసీఆర్ ప్రభుత్వం. దాని పక్కనే హైటెక్ హంగులతో నిర్మించిన ఐటీ టవర్ కనిపిస్తుంది. దాన్ని కట్టించింది కేసీఆర్ సర్కారే.

నాలుగు అడుగులు ముందుకేస్తే న్యాక్ భవనం కూడా కనువిందు చేస్తుంది. ఆ భవనాన్ని కట్టించింది కేసీఆర్ సర్కారే. కొంచెం ఓపిక పడితే మోదీకి పచ్చటి హరితహారం కూడా కనిపించేదే.. కానీ, ఆయన వస్తున్నారని చెట్లను నరికేశారు. కొంచెం దూరంలో బైపాస్ అబ్బురపరుస్తుంది. ఇదీ కేసీఆర్ ప్రభుత్వ అభివృద్ధే.

ఇవన్నీ ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్నాయి. ఎన్నికలు వస్తున్నాయి కదా అని పసుపు బోర్డు పెట్టడం కాదు..

అభివృద్ధి అంటే ఇలా ఉంటుందని ప్రధాని తెలుసుకుంటే మంచిదని ప్రజలు మాట్లాడుకుంటున్నారు.



# ఇటు చూడు మోదీ

## ..అభివృద్ధి అంటే ఇదీ!

నిజామాబాద్ కలెక్టరేట్‌లోనే హెలిప్యాడ్.. పక్కనే ఐటీ టవర్, న్యాక్ బిల్డింగ్
బైపాస్ మీదుగానే రాకపోక.. మోదీకి సీఎం కేసీఆర్ అభివృద్ధి సాక్షాత్కారం

> ప్రధాని మోదీ కండ్ల ముందు తెలంగాణ అభివృద్ధి



నిజామాబాద్ కలెక్టరేట్ పక్కన అద్భుతంగా నిర్మించిన ఐటీ హబ్

నిజామాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నగరంలో జరిగిన అభివృద్ధి అడుగడుగునా స్వాగతం పలుకనున్నది. ప్రధాని హెలికాప్టర్ దిగబోయే ప్రాంతం నుంచి సభాప్రాంగణం వరకు కేసీఆర్ చేసిన అభివృద్ధి సాక్షాత్కరించనున్నది. సమీకృత కలెక్టరేట్, ఐటీ టవర్, న్యాక్ బిల్డింగ్, మందారమాలగా రూపుదిద్దుకున్న బైపాస్ రోడ్డు, రూ.4 కోట్లతో నిర్మితమైన ఆధునిక వైకుంఠధామం వంటివన్నీ మోదీ వస్తున్న ప్రాంతానికి కేవలం 100 చదరపు మీటర్ల పరిధిలోనే ఉన్నాయి. ప్రధాని ఎక్కడికెళ్లినా అక్కడి గుడిసెలు, మురికివాడలు కనిపించకుండా వస్త్రాలతో మూసివేస్తుంటారు. తెలంగాణలో ఆ పరిస్థితులు లేవు. కేసీఆర్ పాలనలో సుందరంగా ముస్తాబైన నగరమే సాక్షీభూతంగా నిలుస్తున్నది. కేసీఆర్ చేసి చూపించిన అభివృద్ధిని పరదాలతో మూసివేసే అవకాశం లేకపోవడం బీజేపీకి ఇబ్బందిగా మారింది.

**కనులారా వీక్షించండి**

ప్రధాని మోదీ మంగళవారం ఆకాశమార్గాన నిజామాబాద్ పర్యటనకు వస్తున్నారు. ఎస్పీజీ అధికారుల వివరాల మేరకు బీదర్ నుంచి ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్‌లో వచ్చి.. సమీకృత కలెక్టరేట్ మైదానంలో దిగుతారు. సువిశాలమైన ఈ ప్రాంతం ఆకాశ మార్గంలో అద్భుతంగా కనిపిస్తుంది. మియావాకీ పద్ధతిలో ఏపుగా పెరిగిన వన సంపద వద్దన్నా ఆకర్షిస్తుంది. ఆకాశమార్గాన వచ్చే మోదీకి తప్పకుండా కనిపిస్తుంది. సమీకృత కలెక్టరేట్‌కు ఆనుకొని, మెట్రో సిటీలకు పరిమితమైన ఐటీ టవర్ సైతం మోదీకి ఘనంగా స్వాగతం పలుకనుంది. రూ.50 కోట్లతో నిర్మించిన ఈ ఐటీ టవర్ ముందునుంచే మోదీ కాన్వాయ్ గిరిరాజ్ కళాశాల మైదానానికి వెళ్లాలి. ఆ పక్కనే రూ.11కోట్లతో నిర్మించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ బిల్డింగ్ సైతం మోదీని ఆకట్టుకోవడం ఖాయం. తెలంగాణలో ఏమి జరిగిందని ప్రశ్నించేవారికి, సీఎం కేసీఆర్ ఏం చేశారో చెప్పడానికి ఇవన్నీ మోదీ కండ్లకు కాకతాళీయంగా దర్శనమివ్వబోయే అభివృద్ధి నమూనాలు. గతుకులు లేని అద్భుతమైన బైపాస్ రోడ్డు, మధ్యలో డివైడర్‌పై పచ్చదనం వరుస, ఆ పక్కనే హరితహారం మొక్కలన్నీ తెలంగాణ గడ్డ గొప్పతనాన్ని ప్రధానికి తెలియజేయనున్నాయి. కేంద్ర సర్కారు సహాయ, సహకారాలు లేకపోయినప్పటికీ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధికి నమూనాగా నిలిచిన తెలంగాణ ఘనతను చాటిచెప్పబోతున్నాయి. ప్రధాని సభల కవరేజీలో మీడియాపై ఆంక్షలు విధించారు. కెమెరాలకు పర్మిషన్ లేదంటూ మెసేజ్‌లు వచ్చాయి.

### నేడు ఇందూరుకు మోదీ

నిజామాబాద్, అక్టోబర్ 2 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో.. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో రెండు వేర్వేరు సభలను నిర్వహిస్తున్నారు. ఒకటి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.8,021 కోట్లతో చేపట్టబోయే అధికారిక కార్యక్రమాల కోసం నిర్వహించే సభ. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మరొకటి బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే రాజకీయ సభ. ఇందు కోసం ప్రధాని మోదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంఐ-17 హెలిక్యాప్టర్‌లో బీదర్ నుంచి బయలుదేరి నిజామాబాద్‌కు మధ్యాహ్నం 2.55 గంటలకు చేరుకుంటారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్‌గా రామగుండంలోని ఎన్టీపీసీ 800 మెగావాట్స్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. దీంతో పాటు పలు రైల్వే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 4 గంటలకు బీజేపీ సభకు హాజరై ప్రసంగిస్తారు. ఒకే మైదానంలో రెండేసి సభల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుండగా.. ఈ కార్యక్రమాల కవరేజీకి ఎస్పీజీ, ఎన్ఎస్‌జీ బలగాలు మీడియాకు ఆంక్షలు విధించాయి.


### మళ్లీ మోసగించేందుకే పసుపు బోర్డు ప్రకటన

**రైతు నాయకుడు కోటపాటి ఆరోపణ**

ఆర్మూర్, అక్టోబర్ 2: ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు పసుపు బోర్డు ప్రకటన చేశారని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, రైతు నాయకుడు కోటపాటి నర్సింహానాయుడు సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మరోసారి రైతులను మోసంచేసేందుకు కుట్రకు తెరలేపారని ఆయన పేర్కొన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు చేయాలంటే పార్లమెంట్‌లో చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని సూచించారు. 1986లో పార్లమెంట్ ద్వారా చట్టమైన స్పైసెస్ బోర్డులో భాగంగా ఉన్న పసుపునకు బోర్డు ఏర్పాటు చేయాలంటే ప్రత్యేక చట్టం చేయాలని ప్రధాని మోదీకి తెలియదా? అని ప్రశ్నించారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ఇటీవల నిర్వహించిన పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో పసుపు బోర్డు కోసం ఎందుకు బిల్లు పెట్టలేదని ప్రశ్నించారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను మభ్య పెట్టవద్దని ఆయన సూచించారు.

# 'విశ్వకర్మ'పై మోదీ ప్రచారం సిగ్గుచేటు

- తెలంగాణ బీసీబంధును చూసి నేర్చుకోండి
- జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి



హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): పీఎం విశ్వకర్మ యోజనపై పాలమూరు సభలో మోదీ గొప్పగా ప్రచారం చేయడం సిగ్గుచేటని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి మండిపడ్డారు. 'పీఎం విశ్వకర్మ యోజన' పథకం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నచందంగా ఉందని విమర్శించారు. 5 శాతం వడ్డీతో కేవలం 18 నెలల్లో తిరిగి చెల్లించాలనే నిబంధనతో 3 లక్షల రుణంగా ఇస్తున్నారని తెలిపారు. వృత్తి నిర్వహణ పెట్టుబడి, ఆధునిక యంత్రాల కొనుగోలు కోసం తెలంగాణ ప్రభుత్వం చేతివృత్తిదారులకు 100 శాతం సబ్సిడీతో, బ్యాంకు లింకేజీలు లేకుండా రూ.లక్ష ఆర్థిక సాయా న్ని అందిస్తున్నదని గుర్తుచేశారు.

# బీఆర్‌ఎస్‌కు మద్దతుల వెల్లువ



ఎన్నికల ఖర్చుకు కిడ్డీ బ్యాంకు డబ్బును మంత్రి వేములకు అందజేస్తున్న చిన్నారి కృతిక

ఏర్గట్ల, అక్టోబర్ 2/భీమ్‌గల్/వర్ని/సిద్దిపేట/డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి: నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం నాగేంద్ర నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కృష్ణ కూతురు కృతిక తన కిడ్డీ బ్యాంకులో రూ.3,840 డబ్బు దాచుకున్నది. సోమవారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఏర్గట్ల మండలంలో పర్యటిస్తుండగా అక్కడికి చేరుకున్న చిన్నారి ఆ మొత్తాన్ని మంత్రికి అందజేసింది. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం మెండోరా విశ్వబ్రాహ్మణ సంఘానికి చెందిన 36 కుటుంబాలు, గౌడ సంఘానికి చెందిన 40, ము ద్కూర్ రజక సంఘానికి చెందిన 65 కుటుంబాలు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్ద తుగా ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలోని వడ్డెర, ముదిరాజ్, ఆర్యవైశ్య సంఘం, గౌడ, విశ్వ బ్రాహ్మణ, నాయీబ్రాహ్మణ, మున్నూరు కాపు కులస్థులతోపాటు జలాల్‌పూర్‌కు చెందిన గూండ్ల కులస్థులు స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలను అందజేశారు. సిద్దిపేట పట్టణంలోని రాజీవ్ రహదారి పక్కన 7.05 కోట్లతో నిర్మించిన వైశ్య సంక్షేమ సమితి కన్వెన్షన్ హాల్‌ను సోమవారం ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు మంత్రికి మద్దతిస్తా మని ఏకగ్రీవంగా ప్రకటించారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన శాలివాహన కుమ్మరి సంఘం సభ్యులు, జక్రాన్‌పల్లి మండలం చింతలూర్‌లోని గంగపుత్ర సంఘానికి చెందిన 23 కుటుంబాలు ఎమ్మెల్యే బాజిరెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు.

# కాంగ్రెస్‌లో మాకు అన్యాయమే

మొదటిపేజీ తరువాయి...

సోమవారం గుడ్‌బై చెప్పేశారు. డీసీసీ అధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గేకు రాజీనామా లేఖ పంపారు. నందికంటి రాజీనామాతో కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని దెబ్బపడింది. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్‌లోనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగానూ పార్టీలోని బీసీ నేతల్లో ముసలం మొదలైంది. మల్కాజిగిరి నియోజకవర్గంలోని మరికొందరు నేతలు కూడా శ్రీధర్ బాటలోనే పయనించి మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమైనా, సోమవారం రాత్రి వరకు నందికంటి వారికి అందుబాటులోకి రాకపోవడంతో నిర్ణయాన్ని మంగళవారానికి వాయిదా వేసుకున్నారు.



రాజీనామా లేఖను చూపుతున్న నందికంటి శ్రీధర్

**కాంగ్రెస్ నేతల్లో అభద్రతాభావం**

మేడ్చల్ మల్కాజిగిరి స్థానంపై శ్రీధర్ మొదటి నుంచీ ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడు పార్టీలో చేరిన మైనంపల్లి హన్మంతరావు ఆ స్థానాన్ని తన్నుకుపోయే అవకాశాలు స్పష్టంగా ఉండడంతో నందికంటి పార్టీని వీడారు. మైనంపల్లి కాంగ్రెస్‌వైపు చూస్తున్నప్పటి నుంచే నందికంటితోపాటు మల్కాజిగిరి కాంగ్రెస్ నేతల్లో అభద్రతాభావం ఏర్పడింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోపాటు హైకమాండ్ కూడా మైనంపల్లి వైపే మొగ్గు చూపడంతో శ్రీధర్ తన నిర్ణయాన్ని సోమవారం వెల్లడించారు. మేడ్చల్ డీసీసీ అధ్యక్ష పదవితో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ సోమవారం సాయంత్రం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు లేఖ పంపారు.

**కన్నీరుమున్నీరైన నందికంటి**

సోమవారం మధ్యాహ్నం నందికంటి శ్రీధర్ మల్కాజిగిరి కాంగ్రెస్ కీలక నేతలతోపాటు దాదాపు వెయ్యి మందికిపైగా పార్టీ శ్రేణులతో రహస్య భేటీ నిర్వహించారు. మౌలాలిలోని క్లాసిక్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఈ సమావేశంలోనే ఆయన పార్టీని వీడుతున్నట్టు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. మూడున్నర దశాబ్దాలుగా పార్టీకి సేవ చేశానని, మల్కాజిగిరిలో పార్టీ బలోపేతానికి కృషి చేశానని పేర్కొన్నారు. పార్టీని తాను కన్నతల్లిలా భావిస్తే ఇప్పుడా కన్నతల్లే తనను మోసం చేసిందని కన్నీరు పెట్టుకున్నట్టు తెలిసింది. తాజా పరిణామాల నేపథ్యంలో కీలక నేతలు సహా వేలాది మంది కాంగ్రెస్‌ను వీడే అవకాశం ఉంది. మంగళవారం తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ అధ్యక్షుడు ఉమేశ్ సింగ్, మల్కాజిగిరి టౌన్ ప్రెసిడెంట్ వెంకటేశ్ యాదవ్, మల్కాజిగిరి డివిజన్ అధ్యక్షుడు నవీన్ తదితరులు ప్రకటించారు.

**మోసాన్ని సహించలేక**

పార్టీని నమ్ముకున్న నందికంటి మూడున్నర దశాబ్దాలుగా సేవ చేస్తున్నారు. బీసీలకు 45 టికెట్లు ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్న వారిలో శ్రీధర్ కూడా ఉన్నారు. అలాంటిది తన సీటుకే ఎసరు వస్తుందని ఆయన ఊహించలేకపోయారు. మైనంపల్లికి ఎదురొడ్డి మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీని కాపాడుకున్న తననే రాష్ట్ర, జాతీయ నాయకత్వం బలి చేయడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు.

### నందికంటి రాజీనామా లేఖ యథాతథంగా

*నేను నందికంటి శ్రీధర్. డీసీసీ పార్టీ ప్రెసిడెంట్‌ని. బీసీ సామాజిక వర్గానికి చెందిన వాడిని. నేను కాంగ్రెస్ పార్టీలో 1994 సంవత్సరం నుంచి నిబద్ధతతో, అంకితభావం, చిత్తశుద్ధి, విధేయతతో పని చేస్తున్నాను. 2018 లో పొత్తుల కారణంగా నాకు టికెట్ దక్కలేదు. ఈసారి (2023) బీసీ అభ్యర్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌లో కుటుంబంలో ఒకరికి మాత్రమే ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. కానీ తెలంగాణలో, ముఖ్యంగా మల్కాజిగిరి, మెదక్ జిల్లాల్లో ఒక కుటుంబానికి రెండు టికెట్లు ఇచ్చారు. మైనంపల్లి హన్మంతరావుకు మల్కాజ్‌గిరి, అతని కుమారుడు రోహిత్‌కు మెదక్ నియోజకవర్గట టికెట్ ఇస్తున్నారు. ఇది అన్యాయం. ఈ ఇద్దరు బీఆర్‌ఎస్ నుంచి వచ్చారు. ఇక్కడ బీసీని పరిగణనలోకి తీసుకోకుండా ఓసీ టికెట్ ఇస్తున్నారనే మనస్తాపంతో రాజీనామా చేస్తున్న.*

# బీసీలకు హ్యాండిచ్చిన కాంగ్రెస్

- ఐదు రోజులుగా ఢిల్లీలో బీసీ నేతల పడిగాపులు
- స్పందించని కాంగ్రెస్ అధిష్ఠానం
- రాహుల్‌ను కలిసినా ఫలితం లేదని నందికంటి శ్రీధర్ రాజీనామా
- రేవంత్‌రెడ్డి నమ్మించి గొంతు కోశారని రగిలిపోతున్న నేతలు

స్పెషల్ టాస్క్ బ్యూరో

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): బీసీలకు పెద్దపీట వేస్తామని నమ్మించిన కాంగ్రెస్ పార్టీ వారికి పెద్ద హ్యాండే ఇవ్వబోతున్నది. ఈ విషయాన్ని ముందే పసిగట్టిన బీసీ ముఖ్య నాయకుల బృందం అధిష్ఠానం వద్ద తమగోడు వెళ్లబోసుకుంటే న్యాయం జరుగుతుందని గుప్పెడు ఆశతో ఢిల్లీకి వెళ్లింది. ఐదు రోజులుగా ఢిల్లీలో పడిగాపులు కాస్తున్నా అధిష్ఠానం నుంచి స్పందన లేకపోవడంతో కొందరు నాయకులు హైదరాబాద్‌కు తిరిగి వచ్చేశారు. వీరిలో మల్కాజ్‌గిరి డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ కూడా ఉన్నారు. పార్టీని నమ్ముకున్న తనకు అన్యాయమే జరిగిందంటూ పార్టీకి రాజీనామా చేశారు. రాహుల్‌గాంధీని కలిసినా ఫలితం లేకపోవడంతో బాధతోనే పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు కన్నీటి పర్యంతమయ్యారు.

**హస్తినలో పడిగాపులు**

బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా ప్రకటిస్తే అందులో బీసీలకు ప్రాధాన్యం లభించలేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మొసలి కన్నీరు కార్చారు. పార్టీ ప్రకటించే జాబితాలో బీసీలకు పెద్ద పీట వేస్తామని రేవంత్ ప్రకటించారు. లోక్‌సభ నియోజకవర్గానికి రెండు సీట్ల చొప్పున కనీసం 34 సీట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. తమ తరపున ఎక్కువ సీట్ల కోసం రేవంత్‌రెడ్డి పోరాడతారని విశ్వసించినా, ఎలక్షన్ స్క్రీనింగ్ కమిటీ గెలుపు గుర్రాల సాకుతో బీసీలకు కేటాయించాలనుకున్న సీట్లకు ఎసరు పెడుతున్నారన్న సమాచారం బయటికి పొక్కింది. అప్రమత్తమైన బీసీ ముఖ్య నాయకులు హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఏండ్ల తరబడిగా పార్టీని నమ్ముకుని, అధికారంలో లేకపోయినా తట్టుకొని నిలబడితే టికెట్లు దక్కకుండా ఢిల్లీలో జరుగుతున్న కుట్రలపై మండిపడ్డారు. రాహుల్‌గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిసి తమ గోడు వినిపించేందుకు ఐదు రోజుల క్రితం బీసీ ముఖ్య నాయకుల బృందం ఢిల్లీ వెళ్లింది. అధిష్ఠానం పెద్దల నుంచి స్పందన కరువవడంతో హతాశులైన కొందరు మనస్తాపంతో హైదరాబాద్‌కు తిరిగిరాగా మిగతా నాయకులు ఐదు రోజులుగా ఢిల్లీలో పడిగాపులు కాస్తున్నారు. అయినప్పటికీ ఖర్గే, రాహుల్‌గాంధీ నుంచి అపాయింట్‌మెంట్ లభించకపోవడంతో నిరాశ నిస్పృహలకు లోనైనట్టు సమాచారం. బీసీలకు ఎక్కువ సీట్లు కేటాయిస్తామని బీరాలు పలికిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాట మార్చి, బీసీ నేతలకు టికెట్లు ఇస్తే ఓసీ అభ్యర్థుల కంటే గెలుపు అవకాశాలు తక్కువ అని సర్వేలో తేలిందని తాజాగా కొత్తరాగం అందుకున్నారు. తమను చివరిదాకా నమ్మించి గొంతు కోసింది టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అని బీసీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధిష్ఠానం పట్ల తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్న బీసీ నాయకులు ముమ్ముందు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నదే రాజకీయ వర్గాలలో హాట్ టాఫిక్‌గా మారింది.

# బీఆర్‌ఎస్‌కు తిరుగులేదు

మొదటిపేజీ తరువాయి...

సంస్థ నిర్వహించిన సర్వేలో తేలింది. ఇక 'ఇండియా టీవీ-సీఎన్ఎక్స్' నిర్వహించిన సర్వేలో బీఆర్‌ఎస్ 8 లోక్‌సభ సీట్లు సునాయాసంగా గెలుచుకుంటుందని పేర్కొంది. ఈ రెండు జాతీయ మీడియా సంస్థలు వచ్చే ఏడాది జరుగనున్న లోక్‌సభ ఎన్నికలపై సర్వేలు నిర్వహించినప్పటికీ, స్థానిక అంశాల ఆధారంగా జరిగే అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ మరింత ఎక్కువ ప్రభావం చూపించనుందని పరోక్షంగా వెల్లడైంది.

**11 ఎంపీ సీట్లు 77 అసెంబ్లీ సీట్లకు సమానం**

టైమ్స్ నౌ-ఈటీజీ రిసెర్చ్ సంస్థ నిర్వహించిన సర్వేలో బీఆర్‌ఎస్ మొత్తం 17 లోక్‌సభ సీట్లకు గాను 11 సీట్లు గెలుచుకోబోతున్నదని పేర్కొన్నది. కాగా 11 లోక్‌సభ స్థానాలు దాదాపు 77 అసెంబ్లీ సీట్లకు (ఒక్కో నియోజకవర్గం పరిధిలో 7 అసెంబ్లీ సీట్లు) సమానం. లోక్‌సభ ఎన్నికలలో ఓటర్లను జాతీయ అంశాలు కొంత ప్రభావితం చేస్తుండగా.. అసెంబ్లీ ఎన్నికలకు వచ్చే సరికి స్థానిక పార్టీ ప్రభావమే ఎక్కువగా ఉంటుంది. దాదాపు 77 అసెంబ్లీ సీట్లను బీఆర్‌ఎస్ గెలుచుకుంటుందని సర్వేలో తేలడంతో ఈ లెక్కన వంద సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని పరోక్షంగా చాటింది. గత అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీ 88 సీట్లు గెలుచుకొని ప్రభంజనం సృష్టించింది. తాజా సర్వేలోనూ తెలంగాణలో బీఆర్‌ఎస్ బలం చెక్కుచెదరలేదని తేలింది. ఈ సారి ఎన్నికలలో వంద సీట్లు గ్యారంటీగా గెలుస్తామని ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేచంద్రశేఖర్‌రావు పలు సంధర్భాల్లో ప్రకటించారు. ఈ అంచనాలకు దరిదాపుల్లోనే తాజా సర్వేలు ఉండటంతో.. బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధించబోతున్నదని తేల్చిచెప్పినట్టు అయింది.

**బీజేపీకి మూడో స్థానమే**

లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి మూడో స్థానమేనని టైమ్స్‌నౌ-ఈటీజీ రిసెర్చ్ సర్వే తేల్చిచెప్పింది. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీది మూడోస్థానమేనని ఇప్పటికే పలు సర్వే సంస్థలు తేటతెల్లం చేసిన సంగతి తెలిసిందే. బీజేపీ 2-3 సీట్లు మాత్రమే గెలుచుకొనే అవకాశం ఉన్నదని ఈ సర్వేలో తేలింది. కాగా, ఇండియా టీవీ – సీఎన్ఎక్స్ నిర్వహించిన ఒపీనియన్ పోల్‌లో మాత్రం బీజేపీ రెండో స్థానంలో ఉంటుందని, మూడో స్థానంలో కాంగ్రెస్ ఉంటుందని వెల్లడైంది. ఈ సర్వే ప్రకారం బీఆర్‌ఎస్ 8 స్థానాలు, బీజేపీ 6 సీట్లు, కాంగ్రెస్ 2 స్థానాలు, ఇతరులు ఒక సీటును గెలుచుకోనున్నట్టు తేలింది.

### కాంగ్రెస్‌లో సర్వే లొల్లి

- కనుగోలు నివేదికలపై అసంతృప్తి

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు ఇచ్చిన సర్వే నివేదికలపై సొంత పార్టీ నేతలు కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయినవాళ్లకు అనుకూలంగా, కానివాళ్లకు వ్యతిరేకంగా ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అవన్నీ 'కొనుగోలు' రిపోర్టులేనని ఆరోపిస్తున్నారు. దాదాపు 30 స్థానాలపై ఇచ్చిన నివేదికలపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ రిపోర్టులపై కొందరు నేతలు అధిష్ఠానానికి కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. స్పందించిన ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అభ్యంతరాలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చెప్పడం చూస్తుంటే రిపోర్టుల లొల్లి తారస్థాయికి చేరినట్టే అనిపిస్తున్నది.

# ఏంఢీ లొల్లి.. తలపట్టుకున్న మైనంపల్లి

- వరుస షాక్‌లతో ఉక్కిరిబిక్కిరి
- మొన్న మెదక్, నిన్న మల్కాజిగిరి అధ్యక్షుడు గుడ్ బై
- రెంటికీ చెడ్డ రేవడిలా పరిస్థితి
- తాను చెడి.. కాంగ్రెస్‌నూ చెరిపి!

### లెక్కలు తారుమారు

> మైనంపల్లి చేరికతో నిన్నమొన్నటి వరకు ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు నీరుగారిపోయింది. ఆయన చేరికతో కాంగ్రెస్ బలపడుతుందనుకుంటే బలహీనపడుతుండడం పార్టీకి మింగుడుపడడం లేదు. ఇద్దరు కీలక నేతలు పార్టీని వీడడం, మరికొందరు అదే బాటలో ఉన్నట్టు తెలియడంతో పార్టీలో ఆందోళన వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్‌లో చేరిన మైనంపల్లి తనకు తానుగా దెబ్బతినడంతోపాటు ఇప్పుడు పార్టీని కూడా దెబ్బతీశారన్న అభిప్రాయం నెలకొంది. ఇటు మల్కాజిగిరి, అటు మెదక్‌లో పార్టీకి ఉన్న బలం పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. పార్టీకి ఆయన గుదిబండలా మారే అవకాశం ఉందన్న అభిప్రాయాన్ని కూడా కొందరు నేతలు బాహాటంగానే వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్‌ను వీడి కుమారుడు రోహిత్‌తో కలిసి కాంగ్రెస్‌లో చేరిన మైనంపల్లి హన్మంతరావుకు షాకులు మీద షాకులు తగులుతున్నాయి. ఆయన రాకను వ్యతిరేకిస్తూ పార్టీని వీడుతున్న నేతల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు కీలక నేతలు పార్టీకి గుడ్‌బై చెప్పడంతో ఏం జరుగుతున్నదో అర్థంకాక మైనంపల్లి తల పట్టుకున్నారు. మెదక్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆదివారం కాంగ్రెస్‌ను వీడగా.. సోమవారం మల్కాజిగిరి డీసీసీ చీఫ్ నందికంటి శ్రీధర్ పార్టీకి బైబై చెప్పేశారు. మరోవైపు, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు జే వెంకట్‌రెడ్డి కూడా పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈ పరిణామాన్ని ఊహించని పార్టీతోపాటు మైనంపల్లి కూడా నివ్వెరపోతున్నారు. మైనంపల్లి చేరికను తిరుపతిరెడ్డి, శ్రీధర్ ఇద్దరూ వ్యతిరేకిస్తూ వచ్చారు. అయినా అధిష్ఠానం గుడ్డిగా ముందుకెళ్లడంతో వారిద్దరూ రాజీనామా చేశారు. వీరిని బుజ్జగించేందుకు చేసే ప్రయత్నాలు ఫలించలేదు. భట్టి విక్రమార్క, మధుయాష్కీగౌడ్ శ్రీధర్ ఇంటికి వెళ్లి బుజ్జగించే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. ఇప్పుడు మరికొందరు నేతలు కూడా పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

**తోడురాని క్యాడర్**

పంతంతో బీఆర్‌ఎస్‌ను వీడిన మైనంపల్లికి కాంగ్రెస్‌లో చేరడంతోనే సంతోషం ఆవిరైంది. తాను పార్టీలో అడుగు పెట్టగానే ఇద్దరు డీసీసీ అధ్యక్షులు పార్టీ వీడటంపై మనస్తాపం చెందినట్టు తెలిసింది. ఈ ఊహించని పరిణామాలు తమ పోటీపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. బీఆర్‌ఎస్ క్యాడర్ తనతో కలిసి రాకపోవడం, కాంగ్రెస్ క్యాడర్ నడిచేందుకు సిద్ధంగా లేకపోవడంతో ఆయన పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదని, అలాంటప్పుడు ఆయనతో కలిసి వెళ్లడం వల్ల దండగన్న చర్చ క్యాడర్‌లో జరుగుతున్నది.